క్లుప్తంగా

రీ సర్వే వేగవంతం చేయండి: ఆర్డీవో

కాకినాడ సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీ సర్వేకు సంబంధించి డివిజన్‌లోని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్‌లతో మంగళవారం సాయంత్రం ఆర్డీవో బీవీ రమణ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వందేళ్ల తర్వాత రీ సర్వే చేపడుతున్న నేపథ్యంలో భూముల కచ్చితత్వం విలువ, రికార్డుల రూపకల్పన పారదర్శకంగా రూపొందించాలని రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యాలయ పరిపాలన అధికారి జి.వరహాలయ్య, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేడు పంచరత్న సేవ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆరు గంటలకు త్యాగరాజ ఆరాధనోత్సవం జరుగుతోందని నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. సంగీత విద్వాంసులతో పంచరత్న సేవ సంగీత కచేరీ నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

రేపు కౌముది ముగ్గుల పోటీలు

కాకినాడ కల్చరల్: స్థానిక భవానీ నగర్‌లోని శుభం కాపు కల్యాణ మండపంలో ది గోదావరి కళాకౌముది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం సంక్రాంతి పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షుడు బాజీబోయిన వెంకటేష్ నాయుడు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ పోటీలో పాల్గొనుటకు ఆసక్తి గల మహిళలు సెల్:98669 31117ను సంప్రదించాలని బాజీబోయిన కోరారు.

పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రామచంద్రరావు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.రామచంద్రరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన తిరుపాణ్యం చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ కావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న రామచంద్రరావును కాకినాడ కళాశాలకు నియమించారు. 2006లో రాజమహేంద్రవరం డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకులుగా ఉద్యోగ జీవితం ప్రారంభించి 11 పీహెచ్‌డీలకు గైడ్‌గా, జర్నల్స్ 96 ప్రచురించడంతో పాటు యూఎస్‌లో ప్రతిష్టాత్మక రామన్ పోస్ట్ డాక్టరల్ ఫైల్ చేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావును కళాశాల హిందీ విభాగాధిపతి డాక్టర్ పసుపులేటి హరి రామ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ చెన్నారావు, నాగేశ్వరరావు, ఎలియా, అధ్యాపకులు, నాన్‌టీచింగ్ సిబ్బంది అభినందించారు.

కెప్టెన్ సత్యప్రసాద్‌కు కలెక్టర్ అభినందనలు



కెప్టెన్ సత్యప్రసాద్‌ను అభినందిస్తున్న కలెక్టర్

కాకినాడ సిటీ: జిల్లా సైనిక సంక్షేమ విభాగం ద్వారా అంకిత భావం, నిబద్ధతతో సేవలందిస్తున్నందుకు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్యప్రసాద్ ఈనెల 7వ తేదీన రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కలెక్టర్ కృతికా శుక్లాను సత్యప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్యప్రసాద్‌ను కలెక్టర్ కృతికా శుక్లా అభినందించారు.

హిందీ నేర్చుకోవడం తప్పనిసరి

కాకినాడ రూరల్: నేటి ఆధునిక కాలంలో హిందీని నేర్చుకోవడం చాలా అవసరమని హిందీ పండిట్ ఆదిరాజు శాంతిలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ హిందీ భాషా దినోత్సవం ఘనంగా జరిగింది .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1949 జనవరి 10న ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో మొదటిసారిగా హిందీని మాట్లాడటంతో ఈ రోజున ప్రపంచ హిందీ దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. రైల్వే, టెలికాం ,పోస్ట్ ఆఫీస్ తదితర కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ అధికార భాషగా ఉందన్నారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో శాంతిలక్ష్మిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, ఎస్. శ్రీ నగేష్, రవిశంకర్ పట్నాయక్, ఎం. సుబ్బారావు, చింతపల్లి సుబ్బారావు ,రాజా, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బదిలీపై నిరసన

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యంను ఆకస్మాత్తుగా బదిలీ చేయడంపై కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం నిరసన వ్యక్తం చేసింది. కళాశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సంఘ గౌరవాధ్యక్షుడు కర్రి భామిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు హాజరైన కమిషనర్ పోలా భాస్కర్ ఏర్పాట్లు సరిగా లేవని అసంతృప్తి వ్యక్తం చేసి ప్రిన్సిపాల్‌కు ఏవిధమైన సంజాయిషీ లేకుండా ఏకపక్షంగా బదిలీ చేయడం సబబు కాదన్నారు. కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా కష్టపడుతున్న ప్రిన్సిపాల్‌ను అసమర్థుడిగా పేర్కొనడం అన్యాయమన్నారు. బదిలీపై న్యాయపోరాటం చేసే దిశగా ఆలోచిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పూర్వవిద్యార్థుల సంఘ అధ్యక్షుడు వత్సవాయి గోపాలకృష్ణనరసరాజా, సత్యస్వరూప్, ముత్యాలరావు, మొహిద్దీన్, సూర్యనారాయణమూర్తి, పంపన సాయికుమార్ పాల్గొన్నారు.

హామీల అమలులో సీఎం జగన్ ఆదర్శం

- గడప గడపకూలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేయాలని తత్వం కలిగిన నేతలు రాజకీయాల్లో చాలా అరుదుగా ఉంటారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అందువల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వంటి నేతలు ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారన్నారు. స్థానిక 12వ డివిజన్ స్వర్ణాంధ్ర కాలనీ ప్రాంతంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్లలో ప్రజలకు అందించారని వివరించారు. మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, పలువురు మాజీ కార్పొరేటర్లు, అధికారులు ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా సీఎం జగన్ అనుసరిస్తున్న విధానాలు, పథకాలు, పాలనా సంస్కరణలను తమ ప్రాంతాల్లో కూడా అమలు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. ఇదే ముఖ్యమంత్రి పరిపాలనాదక్షతకు నిదర్శనమన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి మరోసారి అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో మరింత పరుగులు పెడుతుందని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండగలరన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో ప్రతి ఇంటా ప్రభుత్వ పాలనపై ప్రజలు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, దశరథ, సంగాని నందం, లంకే హేమలత, స్థానిక నేతలు మట్టపర్తి రఘురామ్, పరశురామ్, దుర్గాప్రసాద్, జితేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నీ

రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ టోర్నీ విజేత కాకినాడ రుద్రాస్



విజేతలతో ఎమ్మెల్యే ద్వారంపూడి

నాగమల్లితోట జంక్షన్: రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ పోటీలు మంగళవారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల క్రీడాప్రాంగణంలో ముగిశాయి. ఫైనల్స్‌లో కాకినాడ రుద్రాస్, విజయనగరం జట్లు పోటీపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన కాకినాడ రుద్రాస్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు నష్టానికి 126 పరుగులు చేసింది. 127 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో రెండు వికెట్లు నష్టానికి 91 పరుగులు మాత్రమే చేయగలిగింది. 34 పరుగుల తేడాతో కాకినాడ రుద్రాస్ జట్టు విజయం సాధించి కప్‌ను కైవశం చేసుకుంది. రుద్రాస్ జట్టులోని బ్యాట్స్‌మెన్ కృష్ణ 82, లక్ష్మణ్ 37 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. విజేతలకు కాకినాడ సిటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులు అందజేశారు. విజేతలకు రూ.లక్ష, రన్నర్స్‌కు రూ.30వేల నగదు బహుమతిగా ఇచ్చారు. హరీష్ స్పోర్ట్స్ నిర్వాహకులు టి.హరీష్ కప్‌ను, బాల్స్‌ను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో రాగిరెడ్డి సుబ్బారావు, టోర్నీ నిర్వాహకులు భమిడిపల్లి మూర్తి, మండా కుమార్, కుందాళ కనకదుర్గ, పేరయ్యశాస్త్రి, శర్మ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో క్లియరెన్స్ సేల్



లేపాక్షి షోరూమ్‌లో వస్తువులు

బోట్‌క్లబ్: ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న లేపాక్షి షోరూమ్‌లో క్లియరెన్స్ సేల్ నిర్వహిస్తున్నట్టు షోరూమ్ మేనేజర్ సీహెచ్ వీరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 వరకు ఎంపిక చేసిన వస్తువులపై 10 నుంచి 50 శాతం రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు. కళాత్మక వస్తువులు, కొండపల్లి బొమ్మలు, బంజారా క్రొచెట్ లెస్, సహరాన్‌పూర్ ఉడ్ కార్వింగ్, రోజ్ వుడ్ కార్వింగ్, ఉలెన్ కార్పెట్, లెదర్ వేర్, కళంకారీ శారీస్, డ్రెస్ మెటీరియల్స్, నారాయణ్‌పేట చీరలు, కాశ్మీర్ సిల్క్‌శారీస్, లీఫ్ పెయింటింగ్స్, కదంబ వుడ్ కార్వింగ్, రుద్రాక్ష స్ఫటిక, అన్ని రకాల హస్త కళావస్తువులపై ఈ క్లియరెన్స్ సేల్‌లో లభిస్తాయన్నారు. ఆదివారం కూడా లేపాక్షి షోరూం తెరచి ఉంటుందన్నారు.

ప్రింటర్, స్కానర్ అందజేత

బోట్‌క్లబ్: పీఆర్ బాలికోన్నత పాఠశాలకు రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ రూ.16 వేల విలువ చేసే ప్రింటర్, స్కానర్‌ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీవీ సత్యనారాయణకు క్లబ్ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రకాష్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా హ్యాపీ స్కూల్ ప్రాజెక్టులో భాగంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడమే కాక విద్యార్థులకు అవసరమైన ఆరోగ్య, క్రీడారంగాల్లో కూడా సహకారం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు నేతి నాగేశ్వరరావు, చిరంజీవిరెడ్డి కార్యదర్శి వడ్డాది ఆదిత్య, మాచారెడ్డి, ధనసాగర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో అరుణ పతాకావిష్కరణలు



సీఐటీయూ జిల్లా కార్యాలయం వద్ద అరుణపతాకాన్ని ఎగురవేస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) 17వ అఖిల భారత మహాసభలు జనవరి 18 నుంచి 22 వరకు బెంగళూరులో జరుగుతున్న నేపథ్యంలో సీఐటీయూ ఆల్ ఇండియా పిలుపు మేరకు మంగళవారం కాకినాడ నగరంలో వివిధ ప్రాంతాల్లో అరుణ పతాకావిష్కరణలు నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం వద్ద చంద్రమళ్ల పద్మ, జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శారద, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎం.శివశంకర్, పోర్ట్ ఏరియాలో సూర్యారావు తదితరులు మాట్లాడారు. సీఐటీయూ కార్యాలయం వద్ద జరిగిన సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సీఐటీయూ దేశంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేయడంలో, పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదిరించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, విశాఖ ఉక్కు సహా ప్రభుత్వేతర రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఏ రంగంలో పని చేసే కార్మికులకైనా కనీస వేతం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, మలక వెంకటరమణ, సి వెంకటరావు, రామ్‌చరణ్, స్వామి, వర్మ, నాగలక్ష్మి, వేణు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం జంక్షన్ వద్ద ట్రస్ట్ ఆస్పతి న్యూ ఇయర్ టేబుల్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆవిష్కరించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు నురుకుర్తి రామకృష్ణ, ఆస్పత్రి ఎండీ కల్యాణ్ చక్రవర్తి, డైరెక్టర్ రామకృష్ణ, వడ్డి మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ రీజినల్ సభ్యుడిగా గాంధీ



వైఎంసీఏ రీజినల్ సభ్యుడిగా ఎన్నికైన గాంధీ

నాగమల్లితోట జంక్షన్: యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ సౌత్ ఈస్ట్ ఇండియా సభ్యుడిగా జిల్లాకు చెందిన వైఎంసీఏ కార్యదర్శి గాంధీ ఎన్నికయ్యారని కాకినాడ శాఖ అధ్యక్షుడు పీఎం హెన్రీ మంగళవారం తెలిపారు. కమిటీ చైర్మన్ కొలమూరి ప్రభాకర్ ఈ పేర్లు విడుదల చేశారని ఆయన పేర్కొన్నారు. విశాఖలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు గాంధీని ఎన్నుకున్నారన్నారు. అలాగే రీజినల్ చైర్మన్‌గా డాక్టర్ రోలాండ్ విలియమ్స్ నియమితులయ్యారన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, సభ్యులకు హెన్నీ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- కొంగోడు గడప గడపకూలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కొంగోడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు కోరారు. కరప మండలం కొంగోడు గ్రామంలో రెండో రోజు మంగళవారం సాయంత్రం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చొరవ తీసుకుని అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం యజ్ఞంలా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని లబ్ధిదారులకు తెలియజేయడంతోపాటు వారి సమస్యలను పరిష్కరించేందుకు అండగా ఉంటున్నామన్నారు. ముఖ్యంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సమస్య తదితర వాటిని తెలియజేస్తున్నందున వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, సర్పంచ్ నక్కా బాబులు, ఉపసర్పంచ్ వనుం నారాయణరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకొన్న సాయి జీవిత చరిత్ర నృత్యరూపకం



బాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన సాయి జీవిత చరిత్ర నృత్యరూపకం

కాకినాడ కల్చరల్: స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియలో సంస్థ 52వ వార్షికోత్సవ వేడుకలు, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. బాలత్రిపుర సుందరీ నృత్యనికేతన్ నాట్యాచార్య బేతా సత్యనారాయణ విద్యార్థులు చక్కని హావభావాలతో వివిధ నృత్యరూపకాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. వీరు వినాయక శబ్దం.., హరిమాధవ.., తదితర నృత్యరూపకాలు ప్రదర్శించి అలరించారు. చివరగా ప్రదర్శించిన సాయి జీవిత చరిత్ర నృత్యరూపకం విశేషంగా ఆకట్టుకొంది. బాబా జననం నుంచి మరణించే వరకు జరిగిన ఘట్టాలను కళ్లకు కట్టినట్టు విద్యార్థులు ప్రదర్శించి ఔరా! అనిపించారు. అనంతరం సత్కళావాహిని సభ్యులు నాట్యాచార్య బేతా సత్యనారాయణను సత్కరించారు. నాట్య ప్రదర్శనలో పాల్గొన్న 55 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, శారదాదేవి, నమఃశ్శివాయ, నాగమణి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

నవ్వు నాలుగు విధాలా మేలు



జూనియర్ మోహన్‌బాబు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడరూరల్: ఎప్పుడూ నవ్వుతూ ఉండటం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చని సినీ, బుల్లితెర నటుడు, జూనియర్ మోహన్ బాబుగా పిలిచే చావలి విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఏటా జనవరి 10న ప్రపంచ నవ్వుల దినోత్సవంగా జరుపుకొంటున్నామని జూనియర్ మోహన్ బాబు తెలిపారు. అనంతరం మోహన్ బాబు డైలాగులను వినిపించి ఆహుతులను కడుపుబ్బ నవ్వించారు. అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో జూనియర్ మోహన్ బాబు దంపతులను సత్కరించారు.

నలమాటి సరయ్య మృతి క్రీడారంగానికి తీరనిలోటు

నాగమల్లితోట జంక్షన్: ఆంధ్రశ్రీ బిరుదు గ్రహీత, కాకినాడకు చెందిన జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ మాజీ క్రీడాకారుడు, కురు వృద్ధుడు నలమాటి సరయ్య మృతి జిల్లా క్రీడారంగానికి తీరని లోటని ఒలింపిక్ సంఘ కార్యదర్శి పద్మనాభం మంగళవారం తెలిపారు. ఇటీవల మృతి చెందిన నలమాటి సరయ్యకు కాకినాడలో జరిగిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. 1959 నుంచి 1962 వరకు సరయ్య జిల్లాకు వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్‌లో ప్రాతినిధ్యం వహించారన్నారు. జగన్నాథపురం ఎంఎస్ఎన్‌లో చదువుకుని వీడీఓ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారన్నారు. ఏపీ ఒలింపిక్ సంఘ సభ్యుడిగా కూడా ఆయన జిల్లాకు తన సేవలు అందించారని తెలిపారు. సరయ్య మృతికి ఏపీ ఒలింపిక్ సంఘ, ఏపీ బాడీబిల్డింగ్ సంఘ సభ్యులు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



రమణయ్యపేటలోని రాజీవ్‌గాంధీ కళాశాలలో సంక్రాంతి భోగి మంట వద్ద విద్యార్థుల సందడి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై రామకృష్ణ



తూరంగి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ తూరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో పాల్గొనగా, కొందరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు నాయకులు పూర్వకాలంలో పెద్దలు సంక్రాంతికి కట్టే పంచె, తలపాగా కట్టుకొని వేసిన వేషధారణలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు వేసిన రంగురంగుల ముగ్గులు ఆకర్షించాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన భోగిమంటను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెలిగించి భోగి పిడకలు వేశారు. విద్యార్థులు ప్రత్యేక నృత్యాలు చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, వ్యవసాయ పంటలను ఇంటికి తీసుకువచ్చే ఎద్దు బండ్లు, విద్యార్థులు వేసే సంక్రాంతి నృత్యాలు ఈ కార్యక్రమంలో ఆకర్షణీయంగా నిలిచాయి. విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి తరం సాంకేతిక యుగంలో పయనిస్తున్న తరుణంలో సంప్రదాయ పండగలు మరుగున పడే అవకాశాలున్నాయన్నారు. తెలుగు సంప్రదాయ పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలని ఉపాధ్యాయులకు కన్నబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ బలగం ప్రసన్నకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు గొల్లపల్లి బాబులు, జగడం శ్రీహరి, దుగ్గన దొరబాబు, దాట్ల సత్యనారాయణరాజు, గరికిన అప్పన్న, వాసంశెట్టి త్రిమూర్తులు, రొంగల వెంకటేశ్వరరావు, నరాల నాగేశ్వరరావు, ఆతం వీరభద్రం, కాకి రాజు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను కన్నబాబు మెడల్స్ వేసి అభినందించారు.

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని రాజీవ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో హాజయ్యారు. రంగవల్లులు, భోగి మంటలు, పలు కార్యక్రమాల్లో సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కరపలో సంక్రాంతి సంప్రదాయ పోటీలు

కరప: సంక్రాంతి సంబరాల సందర్భంగా మండలంలోని వేళంగి గ్రామంలో కరప పోలీసుల ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడలైన ముగ్గులు, క్రికెట్, తదితర పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరప ఎస్సై ఎన్.రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్ బాబు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసు శాఖ తరఫున, సంప్రదాయ సంక్రాంతి క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలందరూ సంక్రాంతి పండగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మెగా వాలీబాల్ టోర్నీ విజేతగా ఐడియల్ కళాశాల జట్టు

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం పోలీసుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా జిల్లా స్థాయిలో మూడు రోజులపాటు నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నమెంట్ విజేతగా కాకినాడ ఐడియల్ కళాశాల జట్టు నిలిచింది. మంగళవారం రాత్రి ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో రాయుడుపాలెం శేషాద్రినగర్ జట్టు, ఐడియల్ కళాశాల జట్టు హోరాహోరీగా తలపడగా ఐడియల్ కళాశాలజట్టు విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌ను జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు, అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఆసక్తిగా తిలకించారు. అనంతరం విజేతలు, రన్నర్స్‌కు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లుకు బహుమతులు అందజేశారు.

ఇంద్రపాలెంలో వాలీబాల్ టోర్నీ ప్రారంభం

కాకినాడ రూరల్: స్థానిక ఇంద్రపాలెం గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వాలీబాల్‌టోర్నమెంట్‌ను కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. మూడు రోజులపాటు ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలెం ఎస్సై నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గీసాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సర్పవరం పోలీసులు నిర్వహించిన మెగా వాలీబాల్ టోర్నీ విజేతకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్ బాబు



ఇంద్రపాలెంలో వాలీబాల్ టోర్నీని ప్రారంభిస్తున్న సీఐ శ్రీనివాస్ తదితరులు